# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- భారతదేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి ఫిన్లాండ్ తన మద్దతును ప్రకటించింది.
- సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి ఆర్ గవాయ్ పేరును సిఫార్సు చేశారు.
- భారతీయ రైల్వే ప్రయాణికులకు మొట్ట మొదటిసారిగా ట్రైన్ లో ఎటిఎమ్ సేవలను ప్రారంభించింది.
- ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో మతం ఆధారంగా సీట్లను కేటాయించాలనే ప్రతిపాదనలను భారతదేశంతో సహా G4 దేశాలు వ్యతిరేకించాయి.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27న ప్రసారమవుతుంది.

=======================

భారత్ యూరోపియన్ దేశాలు సైబర్ సెక్యూరిటీ రంగాలలో భాగస్వామ్యాన్ని పునరుద్ఘాటించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ తో ఫోన్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా, ఉక్రెయిన్ సమస్యతో సహా పలు ప్రాంతీయ, ప్రపంచ అంశాలపై ఇరువురు నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నామని సామాజిక మాధ్యంలో నరేంద్రమోదీ పేర్కొన్నారు. డిజిటలైజేషన్ వంటి రంగంలో రెండు దేశాల మధ్య కొనసాగుతున్న సహకారాన్ని ఇరువురు సమీక్షించామని తెలిపారు. క్వాంటం సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్-సెక్యూరిటీ రంగాలతో సహా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఇరుపక్షాలు పునరుద్ఘాటించాయని వెల్లడించారు. యూరోపియన్ యూనియన్ లో ఫిన్లాండ్ ఒక ముఖ్యమైన భాగస్వామి దేశం కాగా భారతదేశం - యూరోపియన్ యూనియన్  సంబంధాల బలోపేతం చేయడంతో పాటు పరస్పర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి ఫిన్లాండ్ అధ్యక్షుడు ఆ దేశ మద్దతును ప్రకటించారు.

=======================

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి ఆర్ గవాయ్ పేరును సిఫార్సు చేశారు. జస్టిస్ గవాయి సుప్రీంకోర్టులో రెండవ అత్యంత సీనియర్ న్యాయమూర్తి కావడంతో ఆయన పేరును కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు ప్రతిపాదించారు. ప్రస్తుత సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీకాలం వచ్చే నెల 13న ముగియనుంది. దీంతో మే 14వ తేదీన బి ఆర్ జస్టిస్ గవాయ్ భారత ప్రధాన న్యాయమూర్తిగా బాద్యతలు చేపట్టి 6 నెలల పాటు ఆ పదవిలో కొనసాగుతారు.

=======================

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో చేపట్టబోతున్న సంస్కరనలలో మతం ఆధారంగా సీట్లను కేటాయించాలనే ప్రతిపాదనలను భారతదేశంతో సహా G4 దేశాలు వ్యతిరేకించాయి. భారతదేశ శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ ఈరోజు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో జరిగిన అంతర ప్రభుత్వ చర్చల సమావేశంలో మాట్లాడుతూ... కౌన్సిల్‌ను సంస్కరించడంలో మతపరమైన ప్రామాణికత ఆధారంగా కొత్తగా సీట్లను పెంచాలనే ప్రతిపాదనలు UN సంప్రదాయానికి విరుద్ధంగా ఉన్నాయన్నారు. బ్రెజిల్, జర్మనీ, జపాన్, భారత్ దేశాలతో కూడిన G4 కూటమి కౌన్సిల్ సభ్యత్వానికి ప్రాంతీయ ప్రాతినిధ్యం మాత్రమే ఆధారంగా పరిగణించాలని ఆయన పేర్కొంటూ ...

(వాయిస్ 37 సెకన్లు)

=======================

భారతీయ రైల్వే ప్రయాణికులకు రైలులో మొట్ట మొదటిసారిగా ఎటిఎమ్ సేవలను ప్రారంభించింది. సెంట్రల్ రైల్వే ముంబై-మన్మాడ్ పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో (ATM)ను ప్రవేశపెట్టింది. రైలు కదులుతున్నప్పుడు ఒక ప్రయాణీకుడు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ATMను వినియోస్తున్న వీడియోను రైల్వే శాఖా మంత్రి అశ్విని వైశానవ్ సామాజిక మాద్యమంలో పంచుకున్నారు. సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించిన అనంతరం ఈ సౌకర్యాన్ని ఇతర రైళ్లకు కూడా విస్తరిస్తామని సెంట్రల్ రైల్వే CPRO, స్వప్నిల్ నీలా తెలియజేశారు.

=======================

స్వచ్ఛ భారత్ ద్వారా పరిశుభ్రమైన వాతావరణాన్ని పెంపొందించాలానే లక్ష్యంతో  పదిహేను రోజుల పాటు జరిగే స్వచ్ఛతా పఖ్వాడా 2025 కార్యక్రమాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈరోజు ప్రారంభించింది. ఈ సందర్భంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఉమాంగ్ నారులా ఈరోజు అధికారులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. వ్యక్తిగత, వృత్తిపరమైన ప్రదేశాలలో పరిశుభ్రత పాటించాలని కోరారు. పర్యావరణాన్ని పచ్చగా వుంచడానికి మొక్కలు నాటాలని ఈ సందర్భంగా అధికారులకు  సూచించారు.

=======================

దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు సడక్ సురక్షా అభియాన్ కార్యక్రమాన్ని విస్తరించడానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖతో కలిసి పని చేస్తున్నామని విద్యా మంత్రి విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. రహదారి భద్రతా అంశంపై ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన సమావేశానికి కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి ఆయన అధ్యక్షత వహించారు. పాఠశాల విద్యా వ్యవస్థ ద్వారా భద్రతా సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు బాధ్యతాయుతమైన డ్రైవింగ్ నియమావళిపై పౌరుల భాగస్వామ్యాన్ని ప్రారంభించడం ద్వారా రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన పెరుగుతుందని ఈ సందర్భంగా  ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు.

విరామం

=======================

భారతదేశంలో రైలు ప్రయాణం మొదలై నేటితో 172 సంవత్సరాలు పూర్తయ్యింది. 1853 ఏప్రిల్ 16న బోరి బందర్ నుండి మహారాష్ట్రలోని థానే వరకూ తొలిసారిగా రైలు ప్రయాణించింది. ఈ చారిత్రాత్మక క్షణాన్ని గుర్తు చేసుకుంటూ రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ భారతీయ రైల్వేల ఆవిర్భావం దేశ చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుందని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ రోజును ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించామని తెలిపారు. ఈ తొలి ప్రయాణంలో 400 మంది 14 కోచ్‌లలో ప్రయాణించారని వెల్లడించారు. కాగా భారతీయ రైల్వేలు మొదటి ప్రయాణం నుంచే దేశానికి సేవ చేయాలనే అంకిత భావం తో పని చేస్తున్నాయని రైల్వే మంత్రి పేర్కొన్నారు.

=======================

గుజరాత్ లోని లోథాల్ వద్ద ఉన్న నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ ను ఈరోజు విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్ సందర్శించారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... "నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్‌పై పనులు మొదటి దశ ఈ సంవత్సరం పూర్తవుతాయని చెప్పారు. ప్రసిద్ధ లోథాల్ ప్రదేశాన్ని సందర్శించే అవకాశం నాకు లభించిందని... ప్రజలు మన వారసత్వంపై ఆసక్తి చూపుతుండటం శుభపరిణామమన్నారు. నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ మన వారసత్వం, చరిత్ర, సంస్కృతికి నిదర్శనమని కొనియాడారు. సముద్ర విధానం మన విదేశాంగ విధానంలో చాలా ముఖ్యమని యువతరం కోసం చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే మన సముద్ర సామర్థ్యం ఇంకా పెరుగుతుందని జయశంకర్ మాట్లాడుతూ..

(వాయిస్ 24 సెకన్లు)

=======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 76,735 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 309 పాయింట్ల లాభంతో 77,044 వద్ద ముగిసింది. నిఫ్టీ 119 పాయింట్ల లాభంలో 23,447 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.67గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ధర ఔన్సు 3,317 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

=======================

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) లో భాగంగా ఢిల్లీ వేదికగా ఈరోజు రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచి రాజస్తాన్ రాయల్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 12 ఓవర్లకు 2 వికెట్ నష్టానికి 92 పరుగులు చేసింది.

=======================

దేశంలోని ప్రతి పేదవాడికి ఆరోగ్య సంరక్షణ అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రి జె.పి. నడ్డా స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో జరిగిన ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ 5వ స్నాతకోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రితో కలిసి కేంద్రమంత్రి వివిధ ఆరోగ్య సంరక్షణ సేవలను

ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ శతాబ్దం ప్రారంభంలో భారతదేశంలో ఒకే ఒక ఎయిమ్స్ ఉండేదని, నేడు దేశవ్యాప్తంగా 22 ఎయిమ్స్ పని చేస్తున్నాయని పేర్కొన్నారు.

========================

========================